కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

ప్రజాశక్తి- విజయనగరం కోట

ఎపిఎస్ ఆర్‌టిసిలో పనిచేస్తున్న లక్ష మంది కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు పెంట భానుమూర్తి డిమాండ్ చేశారు. ఎపి జెఎసి అమరావతి ఉద్యోగుల సంఘం పిలుపుమేరకు శనివారం విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ డిపో వద్ద ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న 3నెలల డిఎ ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతి నెల ఒకటో తేదీ న జీతాలు చెల్లించాలన్నారు. ఈనెల 12న నిర్వహించనున్న నిరసన కార్యక్రమంలో కార్మికులంతా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ నాయకులు కెవి రమణ, ఆర్టీసీ జిల్లా నాయకులు పైడి శ్రీనివాసరావు, విజయనగరం డిపో నాయకులు కోట్ల నారాయణస్వామి , అలజంగి రమేష్ , నెల్లిమర్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస : పోలీసుల నిర్బంధాల నడుమ ర్యాలీ చేస్తున్న గిరిజనులు

- ఎస్‌టి ఎమ్మెల్యేలకు గిరిజన సంఘాల అల్టిమేటం
- బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చొద్దని క్యాంపు కార్యాలయాల ముట్టడికి ప్రయత్నం
- ఎక్కడికక్కడే అడ్డుకున్న పోలీసులు
- ప్రభుత్వ తీరుపై ఆగ్రహించిన గిరిజనులు
- డిప్యూటీ సిఎం, ఎమ్మెల్యేకు వినతులు

గిరిజనం వైపా..? గిరిజనేతరుల వైపా..??

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ శాసనసభలో చేసిన తీర్మానాన్ని రద్దు చేయాలని ఎపి గిరిజన సంఘం, ఆదివాసీ సంఘాల జెఎసి ఆధ్వర్యాన శనివారం పలుచోట్ల నిరసన ర్యాలీలు చేపట్టారు. ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో పార్వతీపురం మన్యం జిల్లాలోని జియ్యమ్మవలస, కొమరాడ మండలాల్లో గిరిజన సంఘం నాయకులు కోరంగి సీతారాం, కొల్లి సాంబమూర్తి, గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అనంతరం స్టేషన్‌కు తరలించి, సాయంత్రం విడిచిపెట్టారు. కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి ఇంటి వద్ద నిరసన తెలిపేందుకు జియ్యమ్మవలస మండలం చినమేరంగి పాలిటెక్నిక్ కళాశాల నుంచి గిరిజనులు చేపట్టిన ర్యాలీని తాళ్లడుమ్మ గ్రామం వద్ద పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడే గిరిజనులు, నాయకులు బైఠాయించారు. పోలీసులకు, గిరిజన సంఘాల జెఎసి నాయకులకు మధ్య కొద్దిసేపు వాగ్వివాదం జరిగింది. గ్రామంలోకి ర్యాలీని అనుమతించబోమని, కొద్దిమంది సభ్యులు మాత్రమే ఎమ్మెల్యే వద్దకు తీసుకువెళ్తామని పోలీసులు తెలిపారు. ఎమ్మెల్యేకు వినతినిచ్చేందుకు వెళ్తే పోలీసులు అడ్డుకోవడం అన్యాయమని గిరిజన సంఘం నాయకులు మండంగి రమణ, మండంగి శ్రీనివాసరావు, రుబ్బ లోవరాజు, పువ్వుల సత్యనారాయణ, తోయక జగదీశ్వరి, అప్పలస్వామి నిలదీశారు. ఆందోళన వద్దకు ఎమ్మెల్యే రావాలని, లేదంటే ఆమె ఇంటి వరకు ర్యాలీని అనుమతించాలని పట్టుబట్టారు. దీంతో పోలీసులు చేసేదేమీ లేక ఎమ్మెల్యే ఇంటి సమీపం వరకు ర్యాలీని అనుమతించారు. అక్కడినుండి పదిమంది జెఎసి నాయకులను ఎమ్మెల్యే వద్దకు పోలీసులు తీసుకువెళ్లారు. గిరిజన జెఎసి నాయకులు ఎమ్మెల్యేను కలిసి వినతి అందజేశారు. పుష్పశ్రీవాణి మాట్లాడుతూ ముఖ్యమంత్రితో చర్చించి గిరిజనులకు న్యాయం జరిగేలా కృషి చేస్తామని తెలిపారు. కొమరాడలో ముందస్తుగా సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తిని శనివారం తెల్లవారు జామున పోలీసులు తన ఇంటి వద్ద నిర్బంధించి స్టేషన్‌కు తరలించారు. సాంబమూర్తి అరెస్టును గిరిజన సంఘం నాయకులు కట్రక సంగమ్మ ఖండించారు. మండల కేంద్రం జూనియర్ కాలేజ్ సెంటర్ వద్ద గిరిజన సంఘ నాయకులు లక్ష్మం, డంగ భద్రలో గిరిజన సంఘం నాయకులు మరక రామారావు, సరుగుడు గూడ గ్రామంలో ఆనందరావు, అంటి వలస గ్రామంలో రామస్వామి ఆధ్వర్యాన నిరసన తెలిపారు.

నిరసనపై ఉక్కుపాదం

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో చేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన సంఘాలు చేపట్టిన నిరసన కార్యక్రమంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు గిరిజన సంఘ నాయకులను ముందుగానే హౌస్ అరెస్టు చేసి అనంతరం స్టేషన్‌కు తరలించారు. ఎమ్మెల్యే నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. పెద్ద ఎత్తున పోలీస్ బలగాలు చిన మే రంగి గ్రామంలో పహారా కాసారు. గిరిజన సంఘం నాయకులు కూరంగి సీతారాంను హౌస్ అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనతో పాటు గిరిజన అభ్యుదయ సంఘం అధ్యక్షుడు అరిక చంద్రశేఖర రావును అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. వీరిని సాయంత్రం విడిచిపెట్టారు. . అడిషనల్ ఎస్‌పి దిలీప్ కిరణ్ , ఎస్సీ ఎస్టీ కమిషన్ డిఎస్‌పి జి.మురళీధర్ కూడా వచ్చి బందోబస్తును పర్యవేక్షించారు.

డిప్యూటీ సిఎంకు వినతి

సాలూరు పట్టణంలో ఎపి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు గెమ్మెల జానకీరావు, కార్యదర్శి వంతల సుందరరావు, ఆదివాసీ సంఘాల జెఎసి వైస్ చైర్మన్‌లు కొండగొర్రి ఉదయ్ కుమార్, మజ్జి నారాయణరావు ఆధ్వర్యాన గిరిజనులు ర్యాలీగా బయల్దేరి, డిప్యూటీ సిఎం రాజన్నదొర నివాసానికి చేరుకున్నారు. డిఎస్‌పి ఎ.సుభాష్ ఆధ్వర్యాన పోలీసులు ఏజెన్సీ ప్రాంతాల నుంచి గిరిజనుల రాకను ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. దీంతో గిరిజన సంఘం నాయకులు డిప్యూటీ సీఎం రాజన్నదొర నివాసానికి శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన రాజన్నదొర.. గిరిజన సంఘాల జెఎసి నాయకులను సిఎం జగన్ మోహన్ రెడ్డి వద్దకు తీసుకు వెళ్తానని చెప్పారు. గిరిజనుల ఆందోళనకు సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మద్దతు తెలిపారు.

డిప్యూటీ సిఎం రాజన్నదొరకు వినతి అందిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ఆర్థిక స్వావలంబనకే ఆసరా

- అవినీతికి తావులేకుండా అర్హులందరికీ పథకాలు
- ఆసరా పంపిణీలో మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మహిళల ఆర్థిక స్వావలంబన కోసమే ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా మహిళల అప్పులను నాలుగు విడతలుగా చెల్లిస్తున్నారని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. అవినీతికి తావులేకుండా రాజకీయాలకు అతీతంగా అర్హులైన నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. వైఎస్‌ఆర్ ఆసరా సహాయం పంపిణీ కార్యక్రమం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి బొత్స మాట్లాడుతూ మూడో విడత ఆసరా కార్యక్రమంలో భాగంగా ఎస్.కోట మండలంలో 1312 మహిళా స్వయంశక్తి గ్రూపులకు చెందిన 14వేల మంది మహిళలకు రూ.7.83 కోట్ల మొత్తాలు సోమవారం నుంచి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్టు మంత్రి వెల్లడించారు. జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ కింద ఏడాదిలో పనులు పూర్తిచేసి వచ్చే ఎన్నికల్లోపే ఇంటింటికీ తాగునీరు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రఘురాజు, మండల ప్రత్యేక అధికారి బిఎస్ఎన్ దొర, జిసిసి చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, ఎంపిడిఒ కె.శేషుబాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి బొత్స తిలకించారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలోగర్భిణులకు సామూహిక సీమంతాలను కలెక్టర్ నిర్వహించారు.

ఎమ్మెల్సీ రఘురాజుపై మంత్రికి ఫిర్యాదు

ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై పార్టీ పట్టణ అధ్యక్షుడు రెహ్మాన్ ఆధ్వర్యాన పలువురు మంత్రి బొత్సకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసేందుకు ఇది సమయం కాదని, విజయనగరం వచ్చి ఇబ్బందులేమైనా ఉంటే తనకు చెప్పాలని నచ్చజెప్పారు. అయితే వీరు వినకపోవడంత మంత్రి మండిపడ్డారు. మీకే కాదు మాకు కూడా ఇబ్బందులున్నాయని మంత్రి అన్నారు

మెరకముడిదాం : మూడవ విడత ఆసరా నిధులు పంపిణీ కార్యక్రమం మండల కేంద్రంలో జరిగింది. మంత్రి బొత్స మాట్లాడుతూ మండలంలో గల 13,902 మంది స్వయం సహాయక సంఘం సభ్యులకు రూ.10.39కోట్లను ప్రభుత్వం చెల్లిస్తునట్లు తెలిపారు. గత టిడిపి ప్రభుత్వం జన్మ భూమి కమిటీ ద్వారా ఎంతో అవినీతి చేసిందని ప్రతి పక్షాన్ని దుయ్య బట్టారు. వచ్చే జూ౦ నుండి నాడు -నేడు పథకాన్ని పూర్తిగా విస్తరింప చేసి రాష్ట్రంలో వున్న నలభై ఐదు వేల పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు జిల్లా అంధత్వ నివారణ సంవస్థ ద్వారా కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జెసి మయూర్ అశోక్, ఎంపిపి తాడ్డి కృష్ణవేణి, ఎస్‌వి రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, ఎంపిడిఒ పి.రామకృష్ణ, తహశీల్దార్ రత్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్‌పి బెల్లాన చొరవ ఫలితం

- వికలాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీకి శిబిరాలు
- 10 నుంచి నియోజకవర్గాల వారీగా నిర్వహణ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ కృషి ఫలించింది. మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్‌కు ఆయన చేసిన అభ్యర్థన మేరకు జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు అవసరమయ్యే రూ.4 కోట్ల విలువైన ఉపకరణాలను హైదరాబాద్‌కు చెందిన ఆలిమ్ కో సంస్థ ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నారు. అందుకోసం జిల్లాలో ఈ నెల 10 నుంచి గుర్తింపు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. దేశంలో ఇటువంటి గుర్తింపు శిబిరాలు ఏర్పాటు చేసి, వాస్తవిక అవసరం గుర్తించి, తదనుగుణంగా పంపిణీ చేసే విధానం మొదటిగా మన విజయనగరం జిల్లాలో చేపడుతున్నారు. రాష్ట్రంలో కేవలం విజయనగరం, పార్వతీపురం మన్యం, చిత్తూరు జిల్లాల్లో మాత్రమే నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాలలో ఏడాది వయస్సుగల వినికిడి లోపమున్న పిల్లలకు అవసరమయ్యే పరీక్షలు, సర్జరీ చేసి, ఉపకరణాలను అమర్చుతారు. అర్హులంతా సంబంధిత ధ్రువపత్రాలతో వచ్చి, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూర్యకుమారి ఒక ప్రకటనలో కోరారు.

శిబిరాల నిర్వహణ ఇలా..

ఈ నెల 10న శృంగవరపుకోట నియోజకవర్గం, 12న బొబ్బిలి, 13న రాజాం, 15న చీపురుపల్లి, 17న గజపతినగరం, 19న నెల్లిమర్ల, 21న విజయనగరం నియోజకవర్గాలకు సంబంధించి శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

కొట్టాం వంతెనకు కష్టాలు

- హైవే నిర్మాణంతో శిథిలావస్థకు
- నరకయాతన అనుభవిస్తున్న పది గ్రామాలకు పైగా ప్రజలు
- బ్రిడ్జిని పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి - జామి

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు విశాఖ - రాయపూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంతో ఓ ఆర్‌అండ్‌బి బ్రిడ్జి మూలకు చేరుతోంది. అదేనండి... హైవే నిర్మాణ పనుల్లో భాగంగా భారీ వాహనాల రాకపోకలతో ఏకంగా ఆ బ్రిడ్జి శిథిలావస్థకు చేరింది. అదెక్కడో కాదు... జామి మండల కేంద్రాన్ని ఆనుకొని గోస్తనీ నదిపై నిర్మించిన జామి - కొట్టాం బ్రిడ్జి పరిస్థితి. ఇది దశాబ్దాలుగా ఎన్నో గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంది. ఈ బ్రిడ్జి పక్క నుంచి విశాఖ-రాయపూర్ హైవే నిర్మాణం జరుగుతోంది. అయితే నదిపై సమాంతరంగా చేపడుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు కొట్టాం వంతెన ప్రధాన రహదారిగా మారింది. భారీ వాహనాలు ఈ బ్రిడ్జి మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఇంతవరకు బాగానే ఉన్నా... ఈ రాకపోకలు బ్రిడ్జిని పూర్తిగా దెబ్బతీస్తున్న పరిస్థితి. అంటే దాదాపుగా హైవే నిర్మాణం పూర్తయ్యేలోపు జామి - కొట్టాం వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరడం ఖాయమనడంలో అతిశయోక్తి లేదు. ఈ నేపథ్యంలోనే జామి - కొట్టాం వంతెనకు కష్టాలు వచ్చిపడ్డాయని అందరూ అనుకుంటున్నారు. గోస్తనీ నదిపై ఉన్న బ్రిడ్జి అటు, ఇటు అనేక గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యంగా ఉంది. హైవే నిర్మాణం పూర్తి చేసుకుని వెళ్లిపోతే.. ఈ బ్రిడ్జి సంగతి ఏమటన్నది అందరి నుంచి ఉత్పన్నమవుతున్న ప్రశ్న. ఈ ప్రశ్న అందరికీ రావడం సమంజసమే. ఈ బ్రిడ్జి నిర్మాణం గురించి తెలిసిన వారికి కచ్చితంగా సందేహం వచ్చి తీరుతుంది.

శిథిలావస్థకు చేరిన కొట్టాం బ్రిడ్జి

అదొక్కటే ఆధారం

మండల కేంద్రమైన జామి గ్రామానికి ఆనుకుని గోస్తని నది ప్రవహిస్తుంది. నది ప్రవాహాన్ని దాటుకుని అవతల గ్రామాలైన విజినిగిరి, తాండ్రంగి, కొట్టాం గ్రామాలకు రాకపోకలు జామి గ్రామం మధ్య నుంచి నదిపై నిర్మించిన చిన్న నేల బ్రిడ్జి మీదుగా సాగేవి. తుపాను, వరదలు వచ్చినప్పుడు నది ఉప్పొంగి ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయేవి. అనేక సందర్భాల్లో ప్రమాదాలు జరిగి, ప్రజలు ప్రాణాలు కూడా కోల్పోయారు. ఈ నేపథ్యంలోనే 1991లో అప్పటి ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధులతో కొట్టాం బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చింది. 1994లో బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. మూడు దశాబ్దాలుగా ఈ బ్రిడ్జి ఒక్కటే రవాణాకు ఆధారం. నేడు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా రహదారితోపాటు వంతెన దెబ్బతింటోంది. రహదారికి మరమ్మతులు చేయడానికి హైవే కాంట్రాక్టర్ బాధ్యత పడొచ్చు. కానీ దెబ్బతిన్న బ్రిడ్జి సంగతేమిటని అందరి ప్రశ్న. మూడు దశాబ్దాల బ్రిడ్జి ఇప్పటికే కొంత పాడుబడింది. దీనిపై భారీ వాహనాలు తిరగడంతో ప్రస్తుతం బ్రిడ్జి బతికి బట్టకట్టే అవకాశాలు లేవని అందరూ ఆందోళన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బి అధికారులు సమగ్ర విచారణ చేసి, వంతెన దెబ్బతినకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

కొట్టాం బ్రిడ్జిపై రాకపోకలు ఆపేయాలి

కొట్టాం బ్రిడ్జిపై రాకపోకలు ఆపేయాలని గతంలో పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాం. అప్పట్లో ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం వెళ్లింది. ప్రస్తుతం ఆర్‌అండ్‌బి ఎస్ఇ ఆధ్వర్యంలో జాయింట్ విచారణ చేసి, బ్రిడ్జిని పరిరక్షించే చర్యలు తీసుకుంటున్నాం. బ్రిడ్జిపై భారీ వాహనాలు నిలుపుదల చేయాలని ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలో చర్యలు తీసుకుంటాం.

- గుప్తా, ఆర్‌అండ్‌బి ఎఇ

అవార్డు అందుకుంటున్న ప్రభాకరరావు

ప్రభాకరరావుకు జాతీయస్థాయి అవార్డు

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని ప్రభుత్వ హోమియో ఆసుపత్రిలో ఫార్మసిస్ట్‌గా పని చేస్తున్న మహంతి ప్రభాకరరావుకు జాతీయస్థాయి అవార్డు లభించింది. హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పబ్లిక్ హెల్త్ కేర్ నేషనల్ హెల్త్ అవార్డుల వార్షికోత్సవం నిర్వహించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవంలో భాగంగా జిల్లా నుండి ప్రభాకరావుకు జాతీయస్థాయి అవార్డు లభించడంతో మండలంలో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆక్యుప్రెజర్, ఆక్యుపంచర్ తదితర వ్యాధులకు మందులు లేకుండా రోగం నయం చేసేందుకు ప్రత్యమ్నయంగా చేసే వైద్య విధానంలో శిక్షణ పొందిన 600 మందిలో దేశవ్యాప్తంగా 16 మందికి ఈ అవార్డు లభించింది. వీరిలో జిల్లా నుండి ప్రభాకరావు ఉన్నారు. శ్రీలంక, అమెరికా అంబాసిడర్లు అచీవ్‌మెంట్ అవార్డుతో పాటు ట్రోఫీని ఇచ్చి అభినందించారు. ఈయనకు అరుదైన అవార్డు లభించడంతో హోమియో వైద్యాధికారి కె. మోహనమూర్తి, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పివి మురళీకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు ప్రభాకరావును అభినందించారు.

రహదారిని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ డివిజన్లలో రూ.52.90 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ప్రారంభించారు. 22వ డివిజన్లోని బొడ్డు వారి జంక్షన్ వద్ద, 23వ డివిజన్ పరిధిలోని బొండాడ వీధి వద్ద, 32వ డివిజన్ తోటపాలెం షిరిడి కాలనీ ప్రాంతాలలో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు మాట్లాడుతూ నిర్లక్ష్యానికి గురైన నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దాలన్న ఆశయంతో కోలగట్ల పనిచేస్తున్నారని అన్నారు. వార్డు పర్యటనలు, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానికుల నుంచి వచ్చిన వినుతులను స్వీకరించి పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. 22వ డివిజన్ కార్పొరేటర్ భవిరెడ్డి సతీష్ మాట్లాడుతూ మౌలిక సదుపాయాల కల్పనా విషయమై ఏ వినతి వచ్చినా వెంటనే పరిష్కరిస్తూ సమస్యలు లేని ప్రాంతాలుగా తీర్చిదిద్దే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, 32వ డివిజన్ కార్పొరేటర్ భోగాపురపు లక్ష్మి, జోనల్ ఇంఛార్జి బోడసింగి ఈశ్వరరావు, నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షులు రామేశ్వరపు రామారావు, కేదారిశెట్టి వెంకన్న బాబు, డివిజన్ అధ్యక్షులు ఊడి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లీష్ పరీక్షకు 70 మంది గైర్హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో శనివారం జరిగిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 99.75 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 24064 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 24004మంది, ప్రైవేటు విద్యార్థులు 25 మందికి 15 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెగ్యులర్, ప్రైవేటు కలిపి 70 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లాలో ప్రశాంతంగా పరీక్ష జరిగిందని, తనిఖీ బందాలు 71 కేంద్రాలను పరిశీలించాయని తెలిపారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో బుచ్చన్న కోనేరు 33కెవి ట్రాన్స్‌ఫార్మర్ పనులు ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి 11గంటలవరకు బుచ్చన్నకొనేరు ప్రాంతంలో విద్యుత్తు సరఫరా నిలిపి వేయనున్నట్లు ఎస్ఇ నాగేశ్వరరావు తెలెఇపారు. ఆ ప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు.

వాలంటీర్ల నియామకానికి నోటిఫికేషన్

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో ఖాళీగా ఉన్న వాలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌కెఆర్‌పురం, నల్లబెల్లిలో ఒక్కొక్క వాలంటీర్ పోస్టుకు ఈ నెల పదో తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యవ'సాయమూ' లేదు... పరిశ్రమలూ రావు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

విజయనగరం ఉమ్మడి జిల్లా 80శాతం ప్రజానీకం ఆధారపడిన వ్యవసాయ రంగానికి తగిన తోడ్పాటు లేదు. మారిన పరిస్థితుల కారణంగా వ్యవసాయ విస్తీర్ణం తగ్గిపోతోంది. మరోవైపు ప్రభుత్వ విధానాల కారణంగా ఉన్న కొద్దిపాటి పరిశ్రమలు మూతపడుతునే ఉన్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా అధినేతల పల్లకీలు మోయడం తప్ప రాజకీయంగా జోక్యం చేసుకునే నాధులే లేకపోవడంతో జిల్లా పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయి. దీంతో, జిల్లాలో గ్రామీణ ముఖచిత్రాలు మారాయి. జిల్లా భౌగోళికంగా 16, 34, 750 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో వ్యవసాయానికి అనువుగావున్న భూమి 9,25,387.5 ఎకరాల వరకు ఉంది. వ్యవసాయ, ఉద్యాన, వాణిజ్య పంటలు సాగుచేసేందుకు ఎంతో అనువుగా ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా వరి, చెరకు, మొక్కజొన్న, పత్తి, మినుములు, పెసలు తదితర అపరాలు వంటి వ్యవసాయ పంటలు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కేవలం 3,41,130 ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఇందులో అత్యల్పంగా ఉద్యాన పంటల సాగు కేవలం 1,67,902 ఎకరాల్లో మాత్రమే ఉంది. నాన్ ఫుడ్ క్రాప్ ఏరియా కూడా 23,096 (6శాతం) ఎకరాలుగా నమోదైంది. గతంలో పోలిస్తే క్రమంగా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. సాగు విస్తీర్ణం కన్నా బీడువారుతున్న సాగుభూములు 2శాతం అధికంగా ఉండడం గమనార్హం. సుమారు 80శాతం జనాభా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగాలపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ, సాగునీటి వసతి కల్పించక పోవడం, ఉద్యాన పంటలను తగినంతగా ప్రోత్సహించకపోవడం, ప్రభుత్వం తరపున బోర్లు, బావులు మంజూరు చేయకపోవడం, మైక్రో ఇరిగేషన్ పథకాలు పూర్తిగా స్తంభించడం వంటి కారణావల్ల సాగు భూమి తగ్గుతోంది. లక్షా 30వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తలపెట్టిన

తోటపల్లి ప్రాజెక్టు మిగులు పనులు పూర్తికాకపోవడం వల్ల లక్ష్యంగా నీరుగారుతోంది. ఇప్పటికీ సుమారు 76వేల ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. తారకరామ తీర్థసాగర్ చేపట్టిన దాదాపు 16ఏళ్లు దాటుతున్నా అతీగతీ లేదు. జంఝావతి తలపెట్టిన నాలుగు పదులు ఎప్పుడో దాటిపోయాయి. ఇక మైక్రో ఇరిగేషన్‌కు అనేది దాదాపు లక్ష్యం అనేదే లేకుండా పోయింది. దీనికితోడు వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులకు స్థానికంగా మార్కెట్ సదుపాయం కల్పించక పోవడం కూడా సాగుభూమి తగ్గుదలకు మరో కారణంగా చెప్పుకోవచ్చు. దీంతో, వ్యవసాయ రంగం ద్వారా జిల్లాకు కేవలం రూ.13,343 కోట్ల (41.2శాతం) ఆదాయం మాత్రమే వస్తోంది. ఈ ప్రభావం రైతులతోపాటు వ్యవసాయ రంగంపై ఆధారపడిన కార్మికులు, వృత్తిదారులపైనా పడింది. మత్స్యకారులు, వడ్రంగి, చేనేత వంటి వృత్తుల నుంచి నేటి తరం దూరమౌతోంది. సుమారు 30ఏళ్లలో వచ్చిన మార్పులే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

జిల్లాలో జ్యూట్ మిల్లులు దాదాపు మూతపడ్డాయి. ఒకప్పుడు 20మిల్లులు ఉన్న ఉమ్మడి జిల్లాలో ప్రస్తుతం నాలుగైదుకు మించి తిరగడం లేదు. ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలకు చెంతనే ముడిసరుకు ఉన్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాల సహకారం కొరవడడంతో ఇప్పటికే ఉన్న పరిశ్రమలు ఉనికి కోల్పోవాల్సి వస్తోంది. పూసపాటిరేగ ప్రాంతంలో అరకొర పరిశ్రమలు మినహా ఇంకేమీ చెప్పుకోదగ్గ పరిశ్రమలేవీ లేవు. ఉన్న కొద్దిపాటి పరిశ్రమల మూత వల్ల వేలాది మంది ఉపాధి కోల్పోవడంతో ఆయా కుటుంబాల వారి ఆర్థిక స్థితిగతులు దెబ్బతిన్నాయి. జిల్లాకు వస్తున్న వార్షిక ఆదాయంలో పారిశ్రామిక రంగం ద్వారా వస్తున్న ఆదాయం ఏటా తగ్గిపోవడం ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. 2017-18లో 19.3శాతంకాగా, 2018-19లో 17.6శాతానికి తగ్గింది. 2019-20 నాటికి అది 15.9శాతానికి పడిపోయింది. ఆరికాభివృద్ధికి అవసరమైన వ్యవసాయ, పారిశ్రామిక రంగాలే ఇలా ఉంటే సేవారంగంలో పురోగతి ఆశించడం అత్యాసే అవుతుంది.

మాట్లాడుతున్న సిఐ అప్పలనాయుడు

చిట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-గజపతినగరం

అనధికారికంగా చిట్టీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ లెంక అప్పలనాయుడు హెచ్చరించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో చిట్టీల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి ప్రజల వద్ద నుంచి డబ్బులు సేకరిస్తే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సిహెచ్.గంగరాజు పాల్గొన్నారు.

ఐప్యాక్ సర్వేతో అధికార పార్టీలో గుబులు

క్షుణ్ణంగా సర్వే చేస్తున్న బృందం

ప్రజాశక్తి-పాలకొండ

అధికార పార్టీకి అసంతృప్తి సెగ గట్టిగానే ఉంది. పాలకొండ నియోజకవర్గంలో ఇప్పటికే రెండుసార్లు వైసిపి జెండా ఎగిరింది. ఎస్టీ నియోజకవర్గంలో వైసిపికి గట్టి పట్టే ఉంది. అయితే కొద్ది కాలంగా అందుకు భిన్నమైన పరిస్థితి కనిపిస్తుంది. ఓటర్లలో కొంత అసంతృప్తి ఉందని నియోజకవర్గంలో చర్చ జరుగుతుంది. దీంతో గత నెల రోజుల నుంచి ఐప్యాక్ సర్వే బృందం ఈ నియోజకవర్గంలో సర్వే చేపడుతున్నట్టు సమాచారం. క్షేత్రస్థాయి నుంచి ఈ సర్వే జరుగుతున్నట్టు తెలుస్తోంది. పాలకొండ నగర పంచాయతీలో అధికార పార్టీ నేతల మధ్య విభేదాలపై కూడా వీరు ఆరా తీసినట్లు సమాచారం. అదే విధంగా సచివాలయ వారీగా పనితీరుపై కూడా దృష్టిపెడుతున్నట్లు తెలుస్తోంది. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులతో పాటు తెలుగుదేశం నేతలతో కూడా మాట్లాడుతున్నట్లు తెలుస్తోంది. పూర్తిగా ఇక్కడ పార్టీ పరిస్థితి ఎలా ఉంది. ముఖ్య నాయకుల పనితీరు ఎలా ఉందన్న అంశాలపై వారు సర్వే చేస్తున్నట్లు సమాచారం.

కొదమ గిరిజనులను వీడని రేషన్ కష్టాలు

ప్రజాశక్తి- సాలూరు

మండలంలోని గిరిశిఖర గ్రామం కొదమ పంచాయతీ గిరిజనులకు ఇంకా రేషన్ కష్టాలు వీడడం లేదు. పంచాయతీ పరిధిలో మూడు రేషన్ డిపోలు ఏర్పాటు చేసినా సమస్యలు తీరడం లేదు. ఏనెల సరుకులు ఆ నెల అందని పరిస్థితి ఏర్పడుతోంది. గతేడాది డిసెంబర్ నుంచి మార్చి వరకు జిసిసి వాహనం ద్వారా రేషన్ సరుకులు కొదమ, సిరివర, చింతామల డిపోలకు సరఫరా జరిగేవి. రేషన్ సరుకులను కొదమ గ్రామాలకు చేర్చే కాంట్రాక్టును జిల్లా అధికారులు జిసిసికి అప్పగించడంతో సక్రమంగా సరఫరా జరిగింది. గత రెండు నెలలుగా రేషన్ బియ్యం అందకపోవడంతో గిరిశిఖర గ్రామాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై డిప్యూటీ సీఎం రాజన్నదొరకు గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే జిల్లా సివిల్ సప్లరు అధికారులతో ఫోన్లో మాట్లాడే ప్రయత్నం చేశారు. వారు అందుబాటులోకి రాకపోవడంతో సిఎస్ డిటితో ఆయన ఫోన్లో మాట్లాడుతూ జిల్లా అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొదమ గిరిజనులకు రేషన్ పంపిణీ తలనొప్పిగా మారిందని, అధికారుల తీరు వల్లనే సమస్య తయారయిందని ఆగ్రహించారు. సమస్య వెంటనే పరిష్కరించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థి దశ నుండే నైతిక విలువలు

ప్రజాశక్తి- గరివిడి

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలను అలవర్చుకోవాలని ఆశయ సంస్థ వ్యవస్థాపకుడు రెడ్డి రమణ అన్నారు. మండలంలోని మందిరివలస ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆయన అవగాహన కల్పించారు. ఆశయ రూరల్ లైబ్రరీ ఆధ్వర్యంలో మొబైల్ బైక్ లైబ్రరీ పర్యటన ద్వారా విద్యార్థులకు పుస్తక పఠనం పెంపొందించి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ మొబైల్ లైబ్రరీ ఇంతవరకు 90 గ్రామాల్లో పర్యటన చేసిందని దీని ద్వారా 11,400 మంది విద్యార్థులు ఉపయోగించుకున్నారని చెప్పారు. అసలు పుస్తకాలు చదవడం అన్నది ఒక సంస్కృతిగా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జగన్నాథం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గల్ఫ్ దేశాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు

కలెక్టరేట్ : హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ శిక్షణతో పాటు గల్ఫ్ దేశాల్లో ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమానికి 18 నుంచి 45ఏళ్లలోపు మహిళా అభ్యర్థుల నుంచి ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ దరఖాస్తులు కోరుతోంది. రాష్ట్రంలో తూర్పు, పశ్చిమ గోదావరి, కడప జిల్లాల్లో హౌస్ కీపింగ్, కుకింగ్, కేర్ టేకర్ అంశాలపై శిక్షణ ప్రారంభించింది. ఈ శిక్షణలో విదేశాల్లో అనుసరించే మతపరమైన సంస్కృతులు, వారి పద్ధతులు, అలవాట్లు, విధానాలతో పాటు ఆయా దేశాల చట్టాల గురించి అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీనికిగాను మహిళలు ఐదో తరగతి చదివి ఉండాలని, చదవడం, రాయడం తెలిసి ఉండాలని, 18 నుంచి 45ఏళ్లలోపు వారై ఉండాలని, మహిళలకు మాత్రమే ఈ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు.

ఉపకరణాలకు దరఖాస్తుల స్వీకరణ

వేపాడ : ఉపకరణాల కోసం వికలాంగుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ బిఎస్‌కెవిఎన్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. సదరం సర్టిఫికెట్ కలిగిన వారు ట్రైసైకిల్, వీల్‌చైర్స్, చెవిటి మిషను, బ్యాటరీ ఆపరేటింగ్ సంబంధించిన పరికరాలను ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల పదో తేదిలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

16న ఆనందో బ్రహ్మ

బొబ్బిలి : యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 16 ఆదివారం సాయంత్రం 5 నుండి 7 వరకు 11వ ఆనందోబ్రహ్మ ప్రదర్శనను స్థానిక కళాభారతి ఆడిటోరియంలో ఏర్పాటు చేస్తున్నట్లు అధ్యక్షుడు ఏం. విజయ మోహన్ రావు శనివారం తెలిపారు. క్లబ్ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఔత్సాహిక కళాకారుల కళా ప్రతిభను ప్రదర్శించుకునే చక్కని వేదికగా ఆనందోబ్రహ్మను రూపొందించామన్నారు. చారిత్రిక, పౌరాణిక, జానపద, కళా రూపాల విభిన్న ప్రదర్శనలతో ఇప్పటివరకు ప్రతీ నెలా మూడవ ఆదివారం పది నెలల పాటు పది ప్రదర్శనలు ఇచ్చామని చెప్పారు. ఈ ఆనందోబ్రహ్మ ప్రదర్శనలో పాల్గొనదలిచిన కళాకారులు 9440744741లో తమను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సభ్యులు ఎన్నా బాబు, తాడుతూరి వెంకట రమణ, పీతల శ్రీనివాస్, ధూపం వాసు, ఏ.వెంకట రమణ పాల్గొన్నారు

రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేస్తున్న అల్లు అర్జున్ అభిమానులు

ఉత్సాహంగా అల్లు అర్జున్ జన్మదిన వేడుకలు

శృంగవరపుకోట : ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ జన్మదిన వేడుకలను పట్టణంలో ఐకాన్ యూత్ అభిమానులు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవీ కూడలిలో అల్లు అర్జున్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎస్‌కోట ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి వైద్యాధికారి సత్య శేఖర్ చేతుల మీదుగా రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ అభిమాన సంఘ నాయకులు వాకాడ కార్తీక్, సుధీర్, నాని, కేశవ, గణేష్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల్లో బలమైన నమ్మకం

బాడంగి.. ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి, నాయకులు

'జగనన్నే మా భవిష్యత్తు'లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బాడంగి

వైసిపి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో బలమైన నమ్మకం ఏర్పడిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. శనివారం మండలంలోని ముగడ గ్రామంలో చేపట్టిన జగనన్న మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమైన పార్టీ నాయకులు, కార్యకర్తలు తిరిగి 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, జెసిఎస్ కన్వీనర్ మరిపి శంకరరావు, సచివాలయ కన్వీనర్ యామలి శివప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైసిపి నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా నిర్వహించారు. ఏడో వార్డులో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ రేజేటి విస్సు, కౌన్సిలర్ దిబ్బ సునీత ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. మల్లమ్మపేటలో వైసిపి మండల అధ్యక్షులు ఇంటి గోపాలరావు, కౌన్సిలర్లు తెంటు పార్వతి, కె.రామారావు ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించారు. రాజకీయాలకు అతీతంగా పాలన చేస్తున్న వైసిపి ఆదరించాలని ప్రజలను కోరారు.

బొండపల్లి : మండలంలోని నెలివాడ, గరుడబిల్లి గ్రామాల్లో సర్పంచులు తాళ్లపూడి కీర్తి, బొద్దల కృష్ణవేణి ఆధ్వర్యాన జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపిపి చల్ల చలంనాయుడు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఇళ్లకు స్టిక్కర్లను అతికించారు. ఎం.కొత్తవలసలో సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు కర్రోతు లక్ష్మీనారాయణ, వేంద్రాంలో సర్పంచ్ కర్రోతు శ్రీనివాసరావు, అంబటివలసలో ఎంపిటిసి తాళ్లపూడి అప్పలనాయుడు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ప్రచారం చేశారు.

డెంకాడ : మండలంలోని జోన్నాడ, చింతలవలస గ్రామాల్లో శనివారం జగనన్నే మన భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రతి కుటుంబానికి అందుతున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపిపి బంటుపల్లి వెంకటవాసుదేవరావు మాట్లాడుతూ మళ్లీ జగనన్న వస్తేనే ఈ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తమ్మునాయుడు, సర్పంచ్ కోటినాయుడు, ఎంపిటిసి మురళి గ్రామ పెద్దలు, కన్వీనర్లు, గృహ సారథులు, నాయకులు వాలంటీర్లు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట -1 సచివాలయం 16వ క్లస్టర్‌లో శనివారం జగనన్నే మా భవ్యషత్ కార్యక్రమాన్ని నగర పంచాయతీ వైస్ చైర్మన్, సచివాలయం కన్వీనర్ సముద్రపు రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్ బొమ్మతో ఉన్న స్టిక్కర్లను ఇంటికి అతికించారు. ఈ కార్యక్రమంలో వాలంటరీ నల్లి అనిల్ కుమార్, గృహసారధులు మద్దిల శ్యామల, సముద్రపు సత్తిబాబు, కనకల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భోగాపురం : మండలంలోని బైరెడ్డిపాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల గూర్చి అడిగి తెలుసుకొంటూ వారి అనుమతితో ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అంటించారు. అనంతరం కన్వీనర్లకు జగనన్నే మా భవిష్యత్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ, జెసిఎస్ మండల కన్వీనర్ బైరెడ్డి యర్రప్పలనారాయణ, నాయకులు పడాల బాను, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, సీరపు గురునాథరెడ్డి, రొయ్యుడు, తదితరులు పాల్గొన్నారు.


భోగాపురం.. ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, నాయకులు

రోడ్లపై గోతుల్లో చేరిన నీరు

బాబోయ్... బొబ్బిలి రోడ్లు

గోతులమయంగా పూల్‌బాగ్, బలిజిపేట రహదారులు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి రహదారులపై ప్రయాణమంటే వాహనదారులు, ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. బొబ్బిలి పట్టణంలోని పూల్‌బాగ్, బలిజిపేట రహదారులు అధ్వానంగా మారాయి. రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఏర్పడటంతో రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బలిజిపేట రోడ్డు విస్తరణ పనులు పూర్తి కాలేదు. రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేస్తామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెపుతున్నా ఆచరణలో చేయడం లేదు. బలిజిపేట రోడ్డుపై మట్టి దిబ్బలు ఉండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేణుగోపాలస్వామి ఆలయ జంక్షన్ నుంచి అమ్మగారికోనేరు గట్టు, ఇక్కడ నుంచి ఓంకార్ జంక్షన్ వరకు రోడ్డు గోతులమయంగా తయారైంది. బలిజిపేట, రాజాం, శ్రీకాకుళం వెళ్లే బస్సులు, వాహనాలు ఇదే రహదారి మీదుగా వెళ్లాలి. దీంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. పూల్‌బాగ్ రహదారి పరిస్థితి కూడా అధ్వానంగా మారింది. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పూల్‌బాగ్, గొల్లవీధి మీదుగా దాడితల్లి ఆలయం వరకు రోడ్డుపై పెద్ద గోతులు ఉన్నాయి. రాజాం, శ్రీకాకుళం, బలిజిపేట నుంచి బొబ్బిలి వచ్చే బస్సులు, వాహనాలు ఇదే రహదారి మీదుగా రావాలి. రోడ్లు గోతులమయంగా ఉండటంతో వాహనాలు తరచూ పాడైపోతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

వర్షం పడితే చిత్తడే

బలిజిపేట రోడ్డు, పూల్ బాగ్ రోడ్డు వర్షం కురిస్తే చిత్తడిగా మారుతున్నాయి. రోడ్లపై ఉన్న గోతుల్లో నీరు చేరడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణమంటేనే ప్రజలు, వాహనదారులు బెంబేలెత్తిపోతున్నారు.

ప్రభుత్వ పథకాలపై ఆరా

జ్యోతి ప్రజ్వలన చేసి మనం-2023 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 20వ డివిజన్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డికి ఆశీస్సులు అందించాలని కోరారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ప్రభుత్వమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ కంటభుక్త తవిటిరాజు, డివిజన్ అధ్యక్షుడు పచ్చిగుళ్ళ కృష్ణమూర్తి, కుమ్మరిగంటి శ్రీనివాసరావు, సుధీర్, కాళ్ళ సూరిబాబు, కనకలగిరి తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి

ఆర్యవైశ్యులు సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. తాము ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూనే.. సంపాదించిన మొత్తంలో కొంత భాగాన్ని సమాజ సేవకు ఉపయోగించాలని కోరారు. వుయ్ వైశ్య 'మనం - 2023 ' ఆత్మీయ కలయిక శనివారం విశాఖపట్నంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఉపసభాపతి కోలగట్ల జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నాలుగు రాష్ట్రాల నుంచి వైశ్య ప్రతినిధులు, వ్యాపారవేత్తలు హాజరయ్యారు. తాము ఎంచుకున్న రంగంలో సాధించిన ప్రగతిని ఆయనకు వివరించారు. నేడు వైశ్యులు వ్యాపార రంగంతో పాటు, వివిధ రంగాల్లో ముందు ఉండడం అభినందనీయమన్నారు. సామాజిక వర్గంలోని ఐక్యతను చాటేందుకు ఇటువంటి కలయికలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పైడా కష్ణ ప్రసాద్ , వుయ్ వైశ్య మనం ఫౌండర్ అనిల్ గుప్తా, గ్లోబల్ ప్రెసిడెంట్ పి.అనిల్, శ్రీనివాసరావు సువర్ణ కుమార్, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వైశ్య వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

టెన్త్ స్పాట్ వేల్యూషన్ రేట్లు పెంచాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

టెన్త్ స్పాట్ వేల్యూషన్ రేట్లు పెంచాలని ఎపిటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు బి.జోగినాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టెన్త్ ప్రశ్నపత్రాల సంఖ్య 11 నుంచి 6కు తగ్గించి, 24 పేజీల జవాబు పత్రాలు ఇవ్వడంతో గతంలో కంటే వేల్యూషన్ కష్టంగా ఉందని తెలిపారు. ఇంటర్మీడియట్ 24 పేజీల జవాబు పత్రాలను వేల్యూషన్ చేసేందుకు అసిస్టెంట్ ఎగ్జామినర్లకు రూ.23 ఇస్తున్న ప్రభుత్వం టెన్త్ జవాబు పత్రాలకు రూ.7 ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. టెన్త్ వేల్యూషన్‌కు రూ.18 చెల్లించాలని, చీఫ్ ఎగ్జామినర్లకు, ఇతర సిబ్బందికి రెమ్యునరేషన్ 50 శాతం పెంచాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న సీతం కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

సీతంలో ముగిసిన హ్యాక్‌థాన్

ప్రజాశక్తి-విజయనగరం

సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గత నాలుగు రోజులు గా జరుగుతున్న హ్యాక్‌థాన్ కార్యక్రమం శనివారం ముగిసింది. సీతం కళాశాల, బ్రెయిన్ ఓ విజన్ సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ హ్యాకథాన్ పేరున జరుగుతున్న విషయం విదితమే. ఈ కార్యక్రమంలో దాదాపు 250 విద్యార్థులు పాల్గొన్నారు . విద్యార్థులు బృందాలుగా ఏర్పడి , ఒక్కో బృందం విజయనగరంలో ఒక వ్యాపారాన్ని ఎంచుకుంది. దాని కోసం ఒక ఇంటరాక్టివ్ వెబ్‌సైట్‌ను రూపొందించింది. బ్రెయిన్ ఓ విజన్ బృందం సిఇఒ గణేష్ నాగ్ నేతత్వంలో, వెబ్ డెవలప్‌మెంట్‌లో విద్యార్థులకు తక్కువ-కోడ్/నో-కోడ్ పద్ధతుల్లో శిక్షణ ఇచ్చారు. కోడింగ్ కార్యకలాపంతో పాటు విద్యార్థులు టగ్ ఆఫ్ వార్, క్యాంప్ ఫైర్, డ్యాన్సులు, డైలాగ్ డెలివరీ, ఒత్తిడిని తగ్గించే కార్యకలాపాలు నిర్వహించారు. ముగింపు రోజున విజయం సాదించిన విద్యార్థులకు రూ. 20వేలు నగదు బహుమతి, సర్టిఫికెట్ అందజేసారు. కార్యక్రమంలో సత్య విద్యా సంస్థల కరస్పాండెంట్ డాక్టర్ బొత్సఝాన్సీలక్ష్మి, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు తదితరులు మాట్లాడారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్. మజ్జి. శశిభూషణ్ రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

ప్రజాశక్తి-వేపాడ

భూసారం పెంచేందుకు రైతులు నవధాన్యాలను సాగుచేయాలని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ సన్యాసమ్మ తెలిపారు. శనివారం మండలంలోని కొంపల్లి యూనిట్ పరిధిలో ప్రతి ఇంటికీ వెళ్లి నవధాన్యాల సాగువల్ల ప్రయోజనాలను వివరించారు. రైతులందరూ ఖరీఫ్‌కు ముందు నవధాన్యాలను సాగుచేసి, 45 రోజుల తర్వాత భూమిలో కలియ దున్నడం వల్ల 18 పోషకాలు లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పిలు వెంకటరావు, రమణమ్మ, నాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

వేసవి తాపానికి ఉపశమనం

●జోరుగా పుచ్చకాయల విక్రయాలు ● ఆరోగ్యానికి మేలంటున్న వైద్యులు

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

రోజురోజుకు పెరుగుతున్న ఎండల నుంచి శరీరానికి ఉపసమనం ఇచ్చి ఆరోగ్యాన్ని అందించే పుచ్చకాయలు (వాటర్‌మిలాన్) మార్కెట్‌లోకి వచ్చాయి. చిన్నారుల నుంచి పెద్దవాళ్ల వరకు వీటిని ఇష్టంగా తింటున్నారు. వేసవి ఎండల్లో ఇవి ఆరోగ్యానికి ఎంతో మంచివి. పెరుగుతున్న ఎండలకుతోడు పుచ్చకాయల అమ్మకాలు జోరందు కున్నాయి. ఇటీవల వీటికి పెరిగిన డిమాండ్‌తో ఎక్కడికక్కడ తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేసి అమ్మకాలు సాగిస్తున్నారు. వీటిలో సుగర్ బేబి, మధుర ఫలాలు, ఆర్కిమెన్ వంటి రకాలకు మంచి గిరాకీ వస్తుంది. ప్రస్తుత మార్కెట్‌లో కిలో రూ.22 నుంచి 25 వరకు లభిస్తుంది. ముక్కల సైజును బట్టి రూ.10 వరకు లభిస్తుంది.

పోషక విలువలు అధికం

పుచ్చకాయల్లో మంచి విలువైన పోషక విలువలున్నాయి. వీటిని తినడం వల్ల శరీరానికి మేలు చేకూరుతుందని వైద్యులు సూచిస్తున్నారు. విటమిన్-బి, పొటాషియం, ఈ ఫలం ద్వారా పుష్కలంగా లభిస్తాయని చెబుతున్నారు. ఇందులో కొవ్వు పదార్థాలుండవని, శరీరానికి మంచి శక్తి లభిస్తుందని పేర్కొంటున్నారు. పుచ్చకాయలో 92శాతం అల్కలైన్, నీటితో పాటు పీచు పదార్థాలు ఉండడం వల్ల మూత్ర పిండాలకు, మూత్రనాళాలకు ఎంతో ఉపయోగం. మలబద్ధకాన్ని నివారించడంలో ఇది ఎంత గానో ఉపయోగ పడుతుంది. ఇందులో ఉండే బీటాకెరోటిన్ శరీరంలో రోగనిరోధ కశక్తిని పెంచుతుంది. అలాగే వృద్ధాప్యంలో వచ్చే అంధ త్వాన్ని తగ్గించే గుణం ఉంది. ఆస్తమా, మధు మేహం, మోకాలి నొప్పులు వంటి సమస్యలకు బాగా పనిచేస్తుంది. రక్త ప్రసరణ సక్రమంగా జరిగేలా చేస్తుంది. వంద గ్రాముల పుచ్చకాయలో 91.45 గ్రాముల నీరు, 6శాతం చక్కెర, 90కేలరీల శక్తి, 7.6 గ్రాముల పిండి పదార్థాలు, 0.6శాతం మాంస కృతులు, పొటాషియం 12 గ్రాములు, కాల్షియం 7 గ్రాములు, సోడియం ఒక మిల్లీ గ్రాము వంతున ఉంటాయని వైద్యులు సూచిస్తున్నారు.

గ్రామాల్లో విరివిగా అమ్మకాలు

వేసవి ఎండలు మండిపోతుండడంతో మండల వ్యాప్తంగా పుచ్చకాయల దుకాణాలు వెలశాయి. పాలకొండ పట్టణంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద, ఆర్‌డిఒ కార్యాలయం వద్ద, వీరఘట్టం రోడ్డులో విస్తృతంగా పుచ్చకాయల వ్యాపారాలు జరుగుతు న్నాయి. ఆయా మార్గాల్లో ప్రయాణించే వారు, విద్యార్థులు ఎండ తీవ్రత నుంచి ఉపసమనం పొందేందుకు వీటిని తింటున్నారు. గ్రామాల్లో సైతం విరివిగా వీటిని విక్రయిస్తున్నారు.

పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-జామి

నారితల్లమ్మ (ఫైల్)

పాముకాటుకు గురై ఓ మహిళ మృతి చెందిన సంఘటన జామి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. జామి మండల కేంద్రానికి చెందిన గర్రెడ్డి నారితల్లమ్మ (35), ముత్యాలు నాయుడు దంపతులు. శుక్రవారం మధ్యాహ్నం తన పొలంలో పనులు చేసేందుకు వెళ్లిన నారి తల్లమ్మ పాముకాటుకు గురైంది. గమనించిన స్థానికులు ఆమెను హుటాహుటీన జామి పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారు జామున ఆమె మృతి చెందింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు జామి పోలీసులు కేసు నమోదు చేశారు.

మాట్లాడుతున్న తెలుగు మహిళా పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు వనజాక్షి

కల్తీ మద్యంతో మహిళల మాంగల్యాలకు ముప్పు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సిఎం జగన్మోహన్ రెడ్డి కల్తీ మద్యంతో మహిళల మాంగల్యాలను తెంచుతున్నారని తెలుగు మహిళా పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి అన్నారు. శనివారం రామతీర్థం టిడిపి కార్యాలయంలో మహిళా నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు మద్యపాన నిషేధం అన్న జగన్ నేడు ప్రతి గ్రామంలో నాసిరకం మద్యం ఏరులే పారిస్తూ మహిళల మాంగల్యాలకు ముప్పు తెచ్చిపెట్టారన్నారు. ఏటా మద్యం అమ్మకాలు ఆదాయం పెంచుకుంటూ పోతూ మద్యపాన నిషేధానికి తూట్లు పొడిచారని ఆరోపించారు. నాలుగేళ్లలో మద్యం అక్రమంగా అమ్మకాలు కొనుగోలు జరిపి రూ.38 వేల కోట్లు జగన్ రెడ్డి దోచుకున్నారని విమర్శించారు. జగన్ రెడ్డి అధికారంలోకి రాగానే నేషనల్, ఇంటర్నేషనల్, బ్రాండ్స్ రద్దుచేసి, తన బినామీలు వైసిపి నేతలకు చెందిన డిస్టలరిలో తయారైన కల్తీ బ్రాండ్లు విక్రయించి వేలకోట్లు దండుకుంటున్నారని తెలిపారు. మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్స్‌కి అనుమతి ఇవ్వకుండా ప్రభుత్వ ఖజానాకు వెళ్లాల్సిన ఆదాయాన్ని కూడా తాడేపల్లి ప్యాలెస్‌కు మళ్ళిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నెల్లిమర్ల టౌన్ పార్టీ అధ్యక్షురాలు బైరెడ్డి లీలావతి, నాయకులు లెంక హైమావతి, కింతాడ కళావతి, రెడ్డి సంతు, కాళ్ల సత్యవతి, కోట్ల సునీత, చీకటి సుహాసిని, నర్వ రామలక్ష్మి, యడ్ల లక్ష్మి, మడ్డు ఆదిలక్ష్మి, ఈపు మీనాక్షి, పొడుగు కృష్ణవేణి, ముడుమంచి లక్ష్మి, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

సీతానగరం : మండలంలోని చినభోగిలి - మక్కువ అంతర్జిల్లా బిటి రహదారి విస్తరణ నిర్మాణం పనులను ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం పరిశీలించారు. పార్వతీపురం నియోజకవర్గం, సాలూరు నియోజకవర్గాలను అనుసంధానం చేస్తూ సాగే మక్కువ నుంచి చినభోగిలి వరకు గల అంతర్‌జిల్లా రహదారి విస్తరణ పనుల కోరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.32 కోట్ల మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ పనులను కాంట్రాక్టరు ఇటీవల ప్రారంభించడంతో పరిశీలించామన్నారు. రోడ్డు విస్తరణ పనులలో భాగంగా బగ్గందొరవలస గ్రామంలో సీసీ కాలువల నిర్మాణం సహితం పూర్తి చేశారన్నారు. అనుకున్న సమయంలోగా నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, వైసిపి నాయకులు ఆర్వీ, టీ వెంకట అప్పల నాయుడు తదితరులు ఆయన వెంట ఉన్నారు.